

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ డ్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (15)*

## *(అనుమతి పాట్లు* ***బెర్లిన్‌లో నేను, నా కుటుంబం****)*

‘‘**మీ సర్టిఫికెట్ రెడీ**’’ అంది కన్సలేట్ అమ్మాయి.

‘ఆహా, ఈ ఆఫీసు అసలైన వెల్‌ఫేర్ స్టేట్‌కి చెందిందని ఋజువైపోయింది’ అనుకున్నాను మనసులో.

అలాగని వాళ్లకి మనసులోనే సర్టిఫికెట్ ఇచ్చేశాను.

రాజుల కాలమైతే – మెడలోంచి ఏ ముత్యాలహారమో తీసి ఇచ్చేయాల్సిన గొప్ప విషయమది మరి.

పైకి ‘‘థాంక్స్’’ అంటూ ఆ కాగితం అందుకుని చూశాను.

నాకూ, శ్రీమతికీ ఫలానా తేదీన పెళ్లయినట్లు ధ్రువీకరిస్తున్న పత్రమది.

ఆ పత్రం కళ్లతో చూస్తుంటే – చెవిలో వేదమంత్రాలు వినిపించాయి.

ఆ పత్రంలోనే ఓ విడియో కూడా కనిపించింది.

అందులో శ్రీమతి, నేను ఒకరి తలపై ఒకరు జీలకఱ్ఱ, బెల్లం పెడుతూ కనిపించాం.

మా పక్కన మా ఇద్దరు పిల్లలూ కూడా అదీ ఇప్పటి వయసులో ఉండడం – ఆ దృశ్యంలోని ప్రత్యేకత.

ఆ పత్రం చదువుతూ కొత్త పెళ్లికొడుకునన్న అనుభూతి చెందుతున్న నన్ను చూసి, ‘‘ఈజిట్ ఓకే’’ అనడిగింది కన్సలేట్ అమ్మాయి.

ఊఁ అనబోయి ఆగిపోయాను.

ఆ పత్రం ఇంగ్లీషులో ఉందని అప్పుడు వెలిగింది నాకు. ‘‘అరే, ఇది ఇంగ్లీషులో ఉంది. నాకు జర్మన్‌లో కావాలి’’ అన్నాను.

‘‘ఇది ఇండియన్ కన్సలేట్. ఇక్కడ మేమిచ్చే సర్టిఫికెట్లు ఇంగ్లీషులోనే ఉంటాయి’’ అందా అమ్మాయి.

‘‘కన్సలేట్ ఇండియన్‌దే ఐనా ఉన్నది జర్మనీలోనే కదా! మీరిచ్చే సర్టిఫికెట్లు జర్మన్సుకోసం కదా, ఇంగ్లీషులో ఇస్తే ఎలా?’’ అన్నాను.

‘‘అది మా సమస్య కాదు. మీది’’ అందా అమ్మాయి వెంటనే.

‘‘నాది సమస్య కాదు. అవసరం. ఈ సర్టిపికెట్ జర్మన్ భాషలో కావాలి. అందుకు దయుంచి మీరే ఏదో ఏర్పాటు చెయ్యాలి?’’ అన్నాను వేడుకోలుగా.

ఆమె నేను చెప్పడం అయ్యేదాకా ఆగింది. కానీ, సమాధానం మాత్రం నేను చెప్పడానికి ముందే సిద్ధం చేసుకున్నట్లుంది.

వాళ్లు సర్టిఫికెట్టుని ఇంగ్లీషులోనే ఇస్తారు. అంతేనని తేల్చేసింది.

కొంతసేపు నా ప్రయత్నం నేను చేశాను.

కొంత వేడుకోలు, కొంత వాదన.

ఏం చేసినా, ఎంత చేసినా నాది అరణ్యరోదనమే ఔతుందని గ్రహించడానికి నాకు పావుగంట పట్టింది.

‘‘పొరపడ్డాను. ఎక్కడున్నా ఇండియన్సు ఇండియన్సే. జర్మనీలోనే ఉన్నా ఇండియన్ కన్సలేట్ – వెల్‌ఫేర్ స్టేట్ లక్షణాలు తెచ్చుకోలేదు’’ అనుకున్నాను కసిగా.

నా మనసు కూడా – అంతకుముందు వాళ్లకిచ్చిన సర్టిఫికెట్‌ని వెనక్కి తీసేసుకుంది.

అంతే కదా! అవతలివాళ్ల గొప్పతనాన్ని అంచనా వెయ్యడంలో, స్వార్థం కూడా తన వంతు పాత్ర నిర్వహిస్తుంది.

అంచనా ఎలా ఉన్నా అవసరం కలిగించే అసహాయత ఒకటి ఉంటుంది కదా!

మనసుతో నిమిత్తం లేకుండా నా చేతులు మాత్రం వాళ్లిచ్చిన మారేజి సర్టిఫికెట్ తీసుకున్నాయి.

వెళ్లేటప్పుడు శ్రీమతి పాస్‌పోర్టు కోసం అడిగాను.

‘‘పాస్‌పోర్టు ఆమెది కదా, ఆమెకే ఇస్తాం’’ అందామె.

అడగ్గానే ఇచ్చేస్తారని యథాలాపంగా అడిగిన నేను ఉలిక్కిపడ్డాను.

ఇందాకట్నించి గట్టిగా వాదిస్తున్నాను కదా, దాని ప్రభావమా ఇది అనుకుని, ‘‘ఈ రోజు తనకి వీలుకాక రాలేదు’’ అని సంజాయిషీ ఇచ్చాను.

‘‘శని, ఆదివారాలు మాకు సెలవు. మిగతా రోజుల్లో ఆఫీసు టైములో ఆమెకి ఎప్పుడు వీలైతే అప్పుడే వచ్చి తీసుకుని వెళ్లమనండి’’ అందామె.

నాకు చిరాకేసింది. ‘‘నేనామె భర్తని. అలాగని మీరే ఇప్పుడు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. మరి ఆమె పాస్‌పోర్టు నాకివ్వరా?’’ అన్నాను.

‘‘ఎవరి పాస్‌పోర్టు వాళ్లకే ఇవ్వాలని నియమం’’ నొక్కించిందా యువతి.

నాకు ఉక్రోషమొచ్చింది, ‘‘ఈ దేశంలో ఉన్నప్పుడు – ఈ దేశంలో ఆఫీసుకోసమని ఇచ్చే సర్టిఫికెట్ – ఈ దేశస్థులకి అర్థమయ్యే భాషలో ఇవ్వాలన్న నియమం లేదు. భార్య పాస్‌పోర్టు భర్తకి ఇవ్వకూడదని నియమమా? అదీ మేమిద్దరం భార్యభర్తలమని ధ్రువీకరిస్తూ మీరిచ్చిన సర్టిఫికెట్ నా చేతిలో ఉండగా....’’ అన్నాను.

ఆమె నవ్వింది, ‘‘ఎందుకో మీరు ఆవేశపడుతున్నారు. మీరడిగింది నియమాలకి విరుద్ధమని మీకు తెలియదా?’’ అంది.

ముందరి కాళ్లకు బంధం అనుకుందుకు లేదు. ఆమె చెప్పింది నిజమే!

పాస్‌పోర్టు పూర్తిగా వ్యక్తిగతం. దానికి అనుబంధాలుండవు. రక్తసంబంధాలుండవు.

నా భార్య పాస్‌పోర్టుని ఆమెకి కాక వేరే వ్యక్తికి, ఆ వ్యక్తి ఆమెకు స్వయానా భర్తయినా సరే, ఇవ్వకూడదన్న నియమం మా మంచి కోసమే!

కానీ – ఇప్పుడది తీసుకుందుకు మరోసారి ఇక్కడికి రావాలంటే ఎందుకో నాకు ఇబ్బందిగా అనిపించింది.

పరిస్థితిని తేలిక చెయ్యాలని, ‘‘కొన్ని నియమాలు అతిక్రమించడానికే – అని ఓ ఇంగ్లీషు సామెత’’ అని స్నేహపూర్వకంగా నవ్వాను.

చట్టాలు, నియమాలు జీవితాన్ని సుకరం చెయ్యడానికి. వాటిని సీరియస్‌గా తీసుకుంటే మనిషి కోర్టుల చుట్టూ తిరగాలి.

స్నేహానికి సంకేతమైన ఓ చిరునవ్వు – న్యాయవాదాల్ని మించి సాయపడగలదన్న వివేకం నాకప్పుడు కలిగింది.

‘‘కానీ ఇది ఇంగ్లండు కాదు. జర్మనీ’’ అని నవ్విందా అమ్మాయి.

ఆ నవ్వు స్నేహపూర్వకంగా ఉండడంతో – నాలో కొంచెం ఆశ, కొంచెం ధైర్యం...

ఆమెకి కూడా పాస్‌పోర్టు ఇవ్వకూడదన్న పట్టింపు ఉన్నట్లు లేదు. తన పవరేమిటో చూపించాలనుకుంది, చూపించింది.

నేను హక్కుగా సాధించాలనుకున్నది – తను చేసే ఫేవర్‌గా మార్చాలనుకుంటోంది.

అది గ్రహించగానే ఇంచుమించు కాళ్లబేరానికి వచ్చేశాను.

ఇలాంటి కాళ్లబేరాల విషయంలో – ఇండియాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదురైన అనుభవాలు ఎంత బాగా పనికొచ్చేయంటే – కొద్ది నిముషాల్లోనే ఆమెకి నామీద జాలి పుట్టింది.

‘‘ఆమెని తీసుకుని మళ్ళీ రావడం మీకు ఇబ్బందిగా ఉన్నట్లుంది. ఈసారికి నియమావళి సడలించి కొంచెం రిస్కు తీసుకుని పాస్‌పోర్టు ఇచ్చేస్తున్నాము. మరోసారి ఇలా జరక్కుండా చూసుకోండి’’ అంటూ శ్రీమతి పాస్‌పోర్టు నాకిచ్చేసింది.

అప్పుడు నేను నాకు కావాల్సిన సర్టిఫికెట్ జర్మన్‌లో కాక ఇంగ్లీషులో ఉందన్న విషయాన్ని పూర్తిగా మర్చిపోయి మహదానందపడిపోయాను.

ఆమెకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుని అక్కణ్ణించి కదిలాను.

బయటకొచ్చి ఊబాన్ ఎక్కేదాకా – నేనింకా పరమానంద స్థితిలోనే ఉన్నాను.

నెమ్మదిగా అందులోంచి బయటపడ్డాక – వాస్తవంలోకి వచ్చి నా ముందున్న కొత్త సమస్యని గుర్తించాను.

ఈ దేశంలో పెళ్లయిందని చెబితే సరిపోదు. పెళ్లయిందన్న ధ్రువపత్రాన్ని చూపించాలన్నారు.

అది చాలా కష్టమైన పని అనుకున్నాను కానీ సాధించగలిగాను.

అదిప్పుడు నా చేతిలో ఉంది. కానీ అందులోని భాష ఇంగ్లీషు. దాన్ని జర్మన్‌కి మార్చాలి – అదీ రెసిడెన్స్ పెర్మిట్ అధికారి ఆమోదించేలా!

‘కత్తి పోయి కర్రా వచ్చే ఢాం ఢాం ఢాం’ అన్నట్లు అదీ నాముందున్న కొత్త సమస్య!

అన్నింటికీ పాపాలభైరవుడిలా డాడ్ సంస్థ ఉండనే ఉంది.

నా మ్యారేజి సర్టిఫికెట్‌కి జిరాక్సు కాపీ తీసి పోస్టులో వాళ్లకి పంపి జర్మన్‌లోకి అనువదించి పంపమని కోరాను.

పోస్టులో జవాబు ఇంచుమించు వెంటనే వచ్చింది.

డాడ్‌కి అనువాద విభాగం లేదుట. ఐతే ఎవరైనా తమకి తాముగా అనువదించి – ఒరిజినల్‌తో కలిపి పంపితే పరిశీలించగలరట.

అనువాదం సక్రమంగా ఉంటే – ఆ విషయాన్ని ధ్రువీకరించగలమని కూడా చెప్పారు.

ఇది నామీద సానుభూతితో నాకోసం వారు చెయ్యగల ఏర్పాటు.

అనువాదం నేనే చెయ్యొచ్చు. కానీ నాది పద్మవ్యూహం విషయంలో అభిమన్యుడి పరిస్థితి.

ఏ పత్రాన్నయినా, వ్యాసాన్నయినా – జర్మన్‌నుంచి ఇంగ్లీషులోకి అనువదించే ప్రయత్నం చెయ్యగలను.

కానీ ఇంగ్లీషునుంచి జర్మన్ అంటే – ఆ భాషలో వ్యాకరణంమీద నాకున్న పట్టు చాలదు.

ఇలాంటి విషయాల్లో నాకు సాయపడగల మరో పాపాల భైరవుడు ఓంప్రకాష్!

అతడికి విషయం చెప్పాను. అతడు వెంటనే బెర్లిన్లో రాట్‌హౌస్ (టౌన్ హాల్)ని సూచించాడు.

వెళ్లాను. వాళ్లని ఇంప్రెస్ చెయ్యడానికి నా సమస్యని జర్మన్ భాషలో చెప్పుకున్నాను.

వాళ్లు నా ప్రయత్నానికి సంతోషించారు. నేను చెప్పేది శ్రద్ధగా విన్నారు.

అంతా విని, ‘‘నీ దగ్గరున్న సర్టిఫికెట్‌ని ఇంగ్లీషునుంచి జర్మన్‌లోకి అనువదించాలి. అదేగా నువ్వు చెప్పేది’’ అన్నారు.

నా సమస్య వారి కర్థమైందని మహదానందపడి, ‘‘ఔను’’ అన్నాను.

నా సంతోషంమీద నీళ్లు చల్లుతూ, ‘‘అది మా పని కాదు’’ అన్నారు వాళ్లు.

అదేదో ఇండియాలో గవర్నమెంటు ఆఫీసులోలా చెప్పేరనుకుందుకు లేదు.

మన గవర్నమెంట్ ఆఫీసుల్లో – ఆఫీసు తొమ్మిదంటే – పదింటికి కూడా వెళ్లొచ్చు. వెళ్లేక రెండు సార్లు టీ టైముంటుంది. ఓసారి లంచి బ్రేకుంటుంది.

మధ్యలో కూడా ఉద్యోగులు ఒకరితో ఒకరు మాట్లాడుకుందుకు బోలెడంత టైముంటుంది.

అలాంటి టైములో వారు ఇంకా అనేక పనులు చెయ్యొచ్చు.

కథ(వ్రా)సుకోవచ్చు. పాటలు ప్రాక్టీసు చేసుకోవచ్చు. నాలాంటివారికి అనువాదాల్లాంటివీ చెయ్యొచ్చు.

ఇక్కడ ఆఫీసుల్లో ఉద్యోగులకి ఫ్రీ టైం లేదు. అనువాదమంటే పెర్సనల్ టైంలో చెయ్యాలి.

మన దేశంలో పెర్సనల్ టైంని ఇతరులకోసం వినియోగించేవారు ఎక్కువే.

కానీ ఇక్కడ పెర్సనల్ టైం – ప్యూర్లీ పెర్సనల్!

పోనీ తెలిసినవాళ్లయితే వేరు. నాకు రాట్‌హౌసులో ఎవరూ తెలియదు. అందుకే ''అది మా పని కాదు'' అని బదులొచ్చింది.

రాట్‌హౌసులో పని కాకపోతే కనుక, టుస్మాకి వెళ్లమని మరో సూచన చేశాడు ఓంప్రకాష్.

అది బెర్లిన్‌లోని టెక్నికల్ యూనివర్సిటీ – విదేశీయుల అవసరాలకు సహకరించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

నేను వెళ్లి టుస్మా వాళ్లని కలుసుకున్నాను.

వాళ్లు నా సమస్యని ఓపికగా విన్నారు. నేను జర్మన్‌లో చెప్పబోతుంటే, 'ఫరవాలేదు, ఇంగ్లీషులోనే మాట్లాడొచ్చు' అని ప్రోత్సహించారు.

వాళ్ల తీరు చూసి, పని జరిగినట్లే భావించాను.

ఐతే వాళ్లు అనువాదాలు చేస్తారుట కానీ, సర్టిఫికెట్లులాంటివి కావు.

ఐనా నాకోసం చేసిపెడతామన్నారు కానీ పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంవల్ల ఆ పని చేపట్టడానికి రెండు నెలలైనా పట్టొచ్చుట.

''సర్టిఫికెట్లలాంటివి మేము అనువదిస్తాం కానీ, దాన్ని ఒరిజినల్‌తో పోల్చి ధ్రువీకరించడానికి మాకు అథారిటీ లేదు. అది మీరు వేరేవాళ్లచేత చేయించుకోవాలి'' అన్నారు వాళ్లు.

జర్మనీవంటి ఒక ఆధునిక దేశంలో, చిన్న సర్టిఫికెట్ అనువాదానికి ఇంత తతంగమా అని నేను వాళ్ల ముందే వాపోయాను.

''సమస్య చిన్నదే కానీ మాకు కొత్తది'' అని ఊరుకున్నాడు టుస్మా అధికారి.

అల్పాక్షరాల్లో అనల్పార్థాలు అంటే ఏమిటో తెలుసుకుందుకు – చక్కని ఉదాహరణ!

జరిగిందంతా విశ్లేషించుకుంటే – తప్పంతా నావైపే ఉన్నట్లు అనిపిస్తుంది. అందుకు కారణం – ఈ వ్యవస్థపై నాకేర్పడిన ఆరాధనాభావం కూడా కావచ్చు.

ఏదిఏమైనా ఎక్కువ ఆలోచించలేదు. ఓంప్రకాష్‌ని కలుసుకుని జరిగింది చెప్పాను.

ఓంప్రకాష్ వెంటనే, ''ఈ విషయమై మనమే ప్రయత్నించొచ్చుగా! ఇంతకాలం మనకిది ఎందుకు తట్టలేదు?'' అన్నాడు.

సమస్య నాది కాబట్టి అది తట్టాల్సింది నాకు. నాకు తట్టింది కూడా. కానీ ఈ అనువాదపు పద్మవ్యూహంలో నేనైతే అభిమన్యుణ్నన్న స్పృహ నాకుంది. ఆ మాట పైకనకుండా, ''ఇది సరదాకు చేసే పని కాదు. బాధ్యతాయుతంగా పని చేసే ఓ సంస్థకి, బాధ్యతగా సమర్పించాల్సిన పత్రం. అందుకు తగ్గ అనువాదం మనవల్ల ఔతుందా?'' అన్నాను.

''నేను, నువ్వు అనుకుంటే కాకపోవచ్చు. 'మనం' అనుకుంటే ఔతుందనే నా నమ్మకం. ఇక్కడ మనం అంటే – నువ్వు, నేను కాక ఓ టర్కీ మిత్రుడు కూడా ఉన్నాడు'' అన్నాడు ఓంప్రకాష్. బహుశా ప్రైమరీ స్కూల్లో పాఠం గుర్తొచ్చి ఉంటుంది.

అతడలా అనగానే నాకు ధైర్యం వచ్చింది.

ఆ సాయంత్రం మేము ముగ్గురం మా ఆఫీసులో కూర్చుని పద్మవ్యూహంలోకి అడుగెట్టాం.

టర్కీ మిత్రుడికి జర్మన్ భాషమీద మా ఇద్దరికంటే ఎక్కువ పట్టుంది.

అతడి పుణ్యమా అని మా అనువాద ప్రక్రియ అనుకున్నకంటే సులభమైంది.

నేనా సర్టిఫికెట్ చదివి మురిసిపోతుంటే – ఓంప్రకాష్ నవ్వి, 'కాకి పిల్ల కాకికి ముద్దు' సామెతని గుర్తు చేశాడు. స్థానిక జర్మన్ పౌరుడు ఎవరైనా ఆ అనువాదాన్ని పరిశీలిస్తే బాగుంటుందన్నాడు.

ఇలాంటి సమయాల్లో నాకు గుర్తొచ్చే ఒకే ఒక్కడు – హైనర్ డెకర్ట్.

అతడికి చూపిస్తే, 'గుడ్ జాబ్' అని మెచ్చుకుంటూనే – పంక్తికి రెండేసి చొప్పున మార్పులు చేశాడు.

ఇక ఆ సర్టిఫికెట్‌ని టైపు చెయ్యాలి.

నేను టైపింగులో శిక్షణ పొందలేదు. కానీ టైపుమిషన్లోకి కాగితం జొనపడం తెలుసు.

కీబోర్డు చూస్తూ ఒంటివేలితో నెమ్మదిగా టైపు చెయ్యడం వచ్చు.

ఎటొచ్చీ ఒక ఇబ్బంది ఉంది.

టైపుమిషన్లో ప్రతి అక్షరానికీ ఓ మీట ఉంటుంది. వేలుతో ఆ మీటని నొక్కగానే, ఒక లీవర్ లేచి క్యాన్ టేపుమీద పడుతుంది. ఆ రిబ్బను కింద ఉన్న కాగితంమీద కార్బన్ ప్రింటు పడుతుంది. మనం వేలితో మీటను తేలికగా నొక్కితే, అక్షరం లైటుగా పడుతుంది. గట్టిగా నొక్కితే అక్షరం ఒత్తుగా పడుతుంది.

అన్ని అక్షరాలూ ఒకేలా కనబడాలంటే – అన్ని మీటల్నీ ఒకేలా నొక్కాలి.

ప్రొఫెషనల్సు టైపు చేస్తే అక్షరాల రంగు ఒకే చిక్కదనంతో ఎంతో అందంగా ఉంటుంది.

నాలాంటివాడు టైపు చేస్తే – అక్షరాలన్నీ నలుపు తెలుపుల మిశ్రమంలా కనిపిస్తాయి.

డెకర్ట్‌కి ఆ విషయం చెప్పాను.

అతగాడు నవ్వి, ''కంగారు పడకు. మన ఆఫీసులో ఎలక్ట్రిక్ టైపుమిషన్ ఉంది. అందులో మీటని గట్టిగా నొక్కినా, నెమ్మదిగా నొక్కినా అక్షరం ఒకేలా పడుతుంది'' అన్నాడు.

ఎలక్ట్రిక్ టైపుమెషిన్లో మరో సౌకర్యం కూడా ఉంది.

టైపు చేసిన మేటర్ మెషీన్లోనే స్టోర్ ఔతుంది.

మనమోసారి చదువుకుని తప్పులుంటే సరిచేసుకోవచ్చు.

మామూలుగా ఐతే టైపు చేసిన కాగితం తీసుకుని తప్పులున్న అక్షరాల్ని తెల్లటి సిరాతో కప్పేయాలి.

అప్పుడా కాగితాన్ని మళ్లీ టైపుమెషీన్లో జొనిపి మీట నొక్కితే మనకి కావాల్సిన అక్షరంమీద పడేలా కాగితం పొజిషన్ని అడ్డస్టు చెయ్యాలి. దానికి ప్రత్యేక నైపుణ్యం ఉండాలి.

ఇంత చేసినా తప్పులు దిద్దిన చోట, అక్షరాలు అతుకుల బొంతలా అగుపిస్తాయి.

ఎలక్ట్రిక్ టైపుమెషీన్లో ప్రింటింగుకి ముందే డ్రాఫ్టుని సరిచేసుకునే అవకాశం – చాలా గొప్ప సదుపాయం.

డెకర్ట్ ఏర్పాటు చేసిన టైపుమెషీన్లో నేనే నా మారేజ్ సర్టిఫికెట్ టైపు చేశాను.

నాణ్యమైన అచ్చు యంత్రంలో ముద్రించబడిన పత్రంలా ఉన్న ఆ సర్టిఫికెట్ చూసి తెగ మురిసిపోయాను.

నేనా సర్టిఫికెట్ డాడ్ ఆఫీసుకి పంపితే రెండు రోజుల్లో వాళ్లు దాన్ని ధృవీకరిస్తూ స్టాంపు వేసి పంపారు.

హమ్మయ్య అనుకున్నాను. ఇక శ్రీమతికి రెసిడెన్సు పెర్మిట్ వచ్చేసినట్లే అనిపించి హుషారెక్కాను.

అలా ఏప్రిల్ 14న రెసిడెన్స్ పెర్మిట్‌కోసం ఆ ఆఫీసుకి సకుటుంబంగా వెళ్లాను.

అక్కడి అధికారి నేను తెచ్చిన కాగితాలు చూడనే లేదు. శ్రీమతి పేరొక్కటీ అడిగి, ''ఆలస్యంగా వచ్చారు. ఈ రోజుకి మీ పని అవదు. రేపు రండి'' అన్నాడు.

ఆయనలా ఎందుకన్నాడో నాకర్థం కాలేదు.

మేము ఆఫీసు తెరిచే సమయానికల్లా అక్కడ లేం కానీ, మూసే వేళకి కాస్త ముందుగానే వెళ్లాం.

అదలాగుంచితే వచ్చినవాళ్లలో కొందరింకా పిలుపుకోసం ఎదురు చూస్తున్నారు.

వాళ్లని వెళ్లిపొమ్మని ఆ అధికారి చెప్పలేదు.

వ్యవహారం తిరకాసుగా అనిపించింది.

ఇండియాలో ఐతే, ఏ చప్రాసీనో పిలిచి, ఏం కావాలో అడిగి తెలుసుకుని తైలం సమర్పించుకోవచ్చు.

ఇదీ అలాంటి సందర్భమేనా అనిపించింది కానీ – నమ్మడానికి మనసొప్పలేదు.

ఎవరినడగాలా అనుకుని, చివరికి ఆ అధికారినే మరోసారి పలకరించి మాకు లభించిన ప్రత్యేక హోదాకి కారణమడిగాను.

ఆయన నవ్వి, ఆఫీసు తెరిచే టైముకి వచ్చి మీ కాగితాలివ్వాలి. వచ్చినవాళ్లని ఆల్ఫాబెటికల్ ఆర్డర్లో పిలుస్తాం. మీరొచ్చేసరికి 'ఆర్' దాటిపోయి 'టి' నడుస్తోంది.రేపు పెందరాళే వచ్చెయ్యండి'' అన్నాడు.

''ఇప్పటికే ఒకటికి రెండు సార్లు తిరిగాను. మరోసారి మా వాళ్లందర్నీ వెంటబెట్టుకుని ఇంత దూరం రావాలా?'' అన్నాను నీరసంగా.

అతగాడు శ్రీమతినీ, పిల్లల్నీ చూసి స్నేహపూర్వకంగా నవ్వాడు.

ఆ నవ్వుకి నా ప్రాణం లేచొచ్చింది. కన్సెషనిచ్చి ఈ రోజే మా పని పూర్తి చేస్తాడన్న ఆశ నాలో పుట్టింది.

''వీళ్లంతా ఎందుకు? రేపు నువ్వొక్కడివీ వస్తే చాలు'' అన్నాడతడు నాతో.

అదే స్నేహపూర్వకమైన నవ్వు. ఎక్కడైనా బావ కానీ వంగతోట కాడ కాదంటోంది ఆ నవ్వు.

'చివరి బంతి ఆడేదాకా ఆట ముగిసినట్లు కాదు' అన్న క్రికెట్ సామెత గుర్తొచ్చింది.

ఇస్సురంటూ వెనక్కి మళ్లాం.

మర్నాడు నేనొక్కణ్ణే వెళ్లాను. అదీ ఆ ఆఫీసు తెరుచుకునే సమయానికి.

అధికారికి కాగితాలిస్తున్నప్పుడు నన్ను చూసి గుర్తు పట్టి స్నేహపూర్వకంగా నవ్వుతాడనుకున్నాను.

కానీ అతడు నవ్వలేదు. అందుకు కారణముంది.

ఈరోజా సీట్లో ఉన్నది నిన్నటి వ్యక్తి కాదు.

''కాగితాలు తీసుకుంటాడా? తీసుకుని శ్రీమతి రాలేదేమని అడిగి, ఆమెని తీసుకుని రేపు మళ్లీ రమ్మంటాడా?'' మనసులో బెంగ.

అతగాడు కాగితాలు తీసుకున్నాడు. ఓసారి పరీక్షగా చూశాడు. అబ్జక్షన్సేవీ ఉన్నట్లు లేదు. ''పేరు పిలుస్తాం. అందాకా వెళ్లి కూర్చోండి'' అన్నాడు.

మనసు తేలిక పడినట్లే అనిపించి బరువెక్కేసింది.

నన్నక్కడ కూర్చోమని, ఓ గంట తర్వాత పిల్చి, మీ ఆవిడేదీ అనడిగి, రాలేదని తెలియగానే, ఆమెని తీసుకుని రేపు మళ్లీ రమ్మంటే...

పోనీ తను రాలేదని ఇప్పుడే చెప్పేద్దామా అనుకున్నాను.

''ఏడిసినట్లుంది. వాళ్లు నిన్నడగలేదు. అనవసరంగా ఈ మాట చెప్పి 'దొంగాడా కరవకురా' అన్న పరిస్థితి తెచ్చుకోకు'' అంది వివేకం.

వివేకం మాట విన్నాను. అక్కడ కూర్చుని పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. చివరికి ఓ గంట తర్వాత నాకు పిలుపొచ్చింది.

విఘ్నేశ్వరుడి పెళ్లికి వెయ్యి విఘ్నాలూ ఐపోయినట్లున్నాయి. స్టాంపు వేసిన రెసిడెన్సు పెర్మిట్ కాగితం నాకు అందింది.

ఆ కాగితాన్ని ఒకటికి రెండు సార్లు చూసుకున్నాను. తర్వాత ఒకటికి రెండు సార్లు చదివాను.

ఇక నేనున్నన్నాళ్లూ నా కుటుంబం నాతోనే ఉంటుంది.

మేమున్నన్నాళ్లూ ఒలోముచ్‌కీ తనింట్లో మమ్మల్ని ఉండనిస్తుంది.

అది తలచుకుని నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆనందపడే ముందు – అది కల కాదు, నిజమేనని ధ్రువపర్చుకున్నాను.

ఇంటికెళ్లి శ్రీమతికి సర్టిఫికెట్ చూపగానే – ‘‘ఇప్పుడిక మనకే బెంగా లేదు. కొన్నాళ్లు అన్నీ మర్చిపోయి, హాయిగా విహారయాత్రలు చెయ్యొచ్చు’’ అంది ఎంతో ఉత్సాహంగా.

ఆమె విహార యాత్రలు అనగానే ఉలిక్కిపడ్డాను.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments